ప్రజాశక్తి
శుక్రవారం 12 జులై 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



వాగుపోరంబోకులో వెలసిన వెంచర్

అలుగు ఆక్రమణ.!

- వెంచర్‌లో కలిసిపోయిన వాగు పోరంబోకు..
- చోద్యం చూస్తున్న రెవెన్యూ శాఖ..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం త్వరలో జిల్లా కాబోతోందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎక్కడెక్కడి భూములన్నీ అమ్మకానికి సిద్ధంగా ఉంచుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. కొందరు రియల్టర్లు సొంత భూమితో పాటు వాగు పోరంబోకు భూములను సైతం కలిపేసుకుంటున్నారు. సొంత భూమి అనుకుని ఉన్న ప్రభుత్వ భూములన్నీ మాయమవుతున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

మార్కాపురం పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-565 ఆనుకుని మార్కాపురం చెరువుకు చెందిన అలుగు కాలువ ఉంది. ఈ అలుగు కాలువ పట్టణ పరిధిలోని పారిశ్రామికవాడ సమీపంలోని 'వై' జంక్షన్‌లో ఉంది. అలుగు కాలువ మీదుగా జాతీయ రహదారి వెళ్లింది. దానిపై వంతెన కూడా నిర్మించారు. చెరువు పూర్తి స్థాయిలో నీటితో నిండిన తరువాత మిగులు నీరు ఇదే అలుగు ద్వారా బయటకు వెళుతుంది. చెరువులో ఎక్కువైన నీరు పారేందుకు 70 అడుగుల వెడల్పుతో కాలువ ఒకటి ఉంది. కాలువకు అటుఇటూ కొంత పోరంబోకు భూమి ఉంది. అలుగు నీరు ప్రవహించే కాలువ ఆక్రమణలకు గురవుతోంది. కాలువకు అటు ఇటూ ఉన్న వాగు పోరంబోకు భూమి కూడా ఆక్రమణకు గురైంది.

ఆక్రమణకు గురైన వాగు ▶ 2లో

'వెలిగొండ' నిర్వాసితుల

పరిహారం సంగతేంటి?

- రూ.1200 కోట్లు కేటాయిస్తేనే ప్యాకేజీలు చేతికి..
- ఇంకా దృష్టి సారించని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు
- నిర్మాణ పనులూ అసంపూర్తి..
- పునరావాస కాలనీలదీ అదే దారి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'జిల్లాలో వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేయడమే ప్రధాన ఎజెండా..' మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో డోలా వీరాంజనేయస్వామి మాటలివీ..

ఎన్నికల ప్రచారంలోనూ ప్రస్తుతం సిఎం చంద్రబాబు మార్కాపురంలోనూ వెలిగొండపై మాట్లాడారు. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇస్తామన్నారు. ఎన్నికల కోసం హడావుడిగా అప్పటి సిఎం జగన్ ప్రారంభం చేయడంపైనా విమర్శలు చేశారు.

పశ్చిమ ప్రాంత తెలుగుదేశం అభ్యర్థులూ వెలిగొండను ప్రచారాస్త్రంగా తీసుకుని ముందుకు సాగారు. ప్రాజెక్టు పరిధిలోఉన్న మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు గెలుపునకు దోహదపడింది.

ఇప్పుడు కొత్త కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా వెలిగొండ ప్రాజెక్టును సందర్శించారు. నిర్వాసితుల వినతులు విన్నారు. దీన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని భావించారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యత ఇదీ. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ముందు దీని పూర్తిచేయడానికి అనేక సవాళు న్నాయి. వాటిని అధిగమించాలి. అందుకు పాలకపక్ష నేతలు గతంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలి. వైసిపిపై చేసిన విమర్శలకు తగినట్లుగా ఇప్పుడు ఆచరణలో ఫలితాలు రాబట్టాల్సి ఉంది. మార్కాపురం నుంచి గెలిచిన ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఏడాది క్రితం వెలుగొండ ప్రాజెక్టును ఎజండాగా తీసుకుని పాదయాత్ర కూడా చేశారు. మరోవైపు వెలిగొండ నిర్వాసితుల సాధన సమితి కూడా ప్యాకేజీలు, పరిహాం ాలు, నిర్వాసితులకు పునరావాస కాలనీల అభివృద్ధి కోసం ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంది. ఎన్నికలకు ముందు అప్పటి సిఎం జగన్ ప్రాజెక్టును ప్రారంభించారు. పనులు పూర్తికానందున నీళ్లు వదల్లేదు. పేరుకే ప్రారంభోత్సవం జరిగింది. ఎన్నికల ప్రయోజనం కోసమంటూ అన్ని రాజకీయ పార్టీలు ధ్వజమెత్తాయి. రైతులకు కూడా దరిచేరనివ్వలేదు. ఎక్కడో అడవుల్లో శిలాఫలకం ఏర్పాటు చేసి అధికారులు, పాలకపక్ష నేతల సమక్షంలో దీన్ని ప్రారంభించడం విమర్శలకు తావిచ్చింది. అధికారంలోకి వచ్చాక జూన్‌లో ప్యాకేజీలు ఇస్తామని ప్రకటించారు. అధికారం మారిపోయింది. తెలుగు దేశం ప్రభుత్వం మళ్లీ వచ్చింది. ఇప్పుడు దీని పనులు పూర్తిచేయాల్సిన బాధ్యత ఉంది. సిఎం చంద్రబాబుకు 1996లో దీనికి శంకుస్థాపన చేశారు. 1999 నుంచి 2004 వరకూ సిఎంగా ఉన్న దీని పనులు చేపట్టలేదు. 2004లో కాంగ్రెసు అధికారంలోకి వచ్చాక అప్పటి సిఎం వైఎస్ దీని పనులు చేపట్టారు. ఆయన హయాంలోనే పనులు సింహభాగం జరిగాయి. తర్వాత దీని పనులు నత్తనడకనే సాగాయి. 2014 నుంచి ▶ 2లో

రైల్వే ప్రమాదాల నివారణకు కృషి

- అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి..
- గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ



రైల్వే డిఆర్‌ఎంకు తమ సమస్యలను వినిపిస్తున్న ఆటో డ్రైవర్స్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఇటీవల కాలంలో తరచుగా జరుగుతున్న రైల్వే ప్రమాదాల నివారణకు రైల్వే శాఖలో ఉన్న అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక రాయవరం రైల్వే స్టేషన్ నందు రైల్వే శాఖలో కీలకమైన ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులతో డిఆర్ ఎం.రామకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచుగా జరుగుతున్న రైల్వే ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్క రైల్వే ఉద్యోగి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఆవరణంలో ఆటోల పార్కింగ్‌కు అనుమతి ఇవ్వాలంటూ గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ రామకష్ణను ఏఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఏలూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు మర్యాదపూర్వకంగా కలిసి స్టేషన్ ఆవరణంలో తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ప్రయాణికులకు పట్టణం నుండి రైల్వేస్టేషన్‌కు రైల్వేస్టేషన్ నుండి బస్టాండ్‌కు తరలించడంలో ఆటోలు ముఖ్య పాత్ర పోషించడం జరుగుతుందన్నారు. రైలు వచ్చే సమయంలో ఆటోలను రైల్వే స్టేషన్ ఆవరణంలోకి అధికారులు అనుమతి ఇవ్వటం లేదన్నారు. ఫలితంగా జీవనోపాధి కోల్పోతున్నామని ఆటో డ్రైవర్లు డిఆర్‌ఎం ఎదుట వాపోయారు. స్పందించిన డిఆర్‌ఎం రామకృష్ణ ఈ సమస్యపై త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటు చేసి వారి నివేదిక ఆధారంగా తప్పక పరిష్కార మార్గం చూపుతానని హామీ ఇచ్చారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు

దొనకొండ: దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ విషయమై మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. రైల్వేస్టేషన్ల పరిశీలనలో భాగంగా గురువారం మధ్యాహ్నం ఆయన ప్రత్యేక రైలు దొనకొండకు చేరింది. దొనకొండకు చెందిన మల్లెల రామిరెడ్డి, ఎం రమేష్, మరికొందరు డీఆర్‌ఎంను శాలువాతో సన్మానించారు. దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని, దాదాపు మూడేళ్లుగా విన్నవించుకుంటున్నామని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కనీసం హుబ్లీ అమరావతి, బెంగుళూరు కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డీఆర్‌ఎం రెండు రైళ్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న అమృత్‌భారత్ పథకం పనులను పరిశీలించి.. పలు సూచనలు, సలహాలు అందించారు. రైల్వే కార్యాలయాలను తనిఖీలు చేసి రైల్వే సిబ్బంది చేపడుతున్న పని తీరును పరిశీలించి అనేక విషయాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులను

అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు

కలెక్టర్ వెంకటమురళి ▶ 8లో

అందరి సహకారంతో

ప్రజలకు మేలు జరిగేలా కృషి

- బాధ్యతలు చేపట్టిన సంయుక్త కలెక్టర్ సుబ్బారావు



మాట్లాడుతున్న జేసీ సుబ్బారావు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అందరి సహకారంతో ప్రజలకు మేలు జరిగేలా పనిచేస్తానని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్‌గా కలెక్టరేట్‌లో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా కలెక్టర్ జె వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అన్నింటిలో ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం, ప్రజలు ఆనందంగా ఉండటమే లక్ష్యమని చెప్పారు. గ్రీవెన్స్ కార్యక్రమాలలో అత్యధికంగా రెవిన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ శాఖపై ప్రత్యేకంగా దష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, జిల్లా అభివద్ధికి తన వంతు కష్టపడి పని చేస్తానన్నారు. వివిధ శాఖల్లో వివిధ హోదాలలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. తన అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. ప్రభుత్వ సర్వీసులో 34 సంవత్సరాలు సేవ చేసే అవకాశం ▶ 2లో

'వెలిగొండ' నిర్వాసితుల పరిహారం సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

2019 వరకూ చంద్రబాబు అధికారంలో ఉన్నారు. దీన్ని పూర్తి చేయలేకపోయారు. గత ప్రభుత్వ హయాంలో కొంత మేరకు పనులు నడిచినా పూర్తయితే కాలేదు. నిర్వాసితులను పూర్తిగా పక్కన పెట్టేశారు. సంక్షేమ పథకాలకే ప్రాధాన్యత ఇచ్చారు. అందుకే ఐదేళ్లలో పూర్తయ్యే అవకాశం ఉన్నా చేయలేదు. పనులు పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం చేసుకున్నారు. రైతుల అభ్యంతరాలను పట్టించుకోలేదు. అందుకే ఎన్నికల్లో ఈ ప్రాజెక్టు పరిధిలో 3 నియోజకవర్గాల్లో వైసిపి ఓటమి చవిచూసింది. ఒక నియోజకవర్గంలోనే గెలిచింది. ఇక జరగాల్సిన పనులను పరిశీలిస్తే నిర్వాసితులదే పెద్ద ఎజెండాగా ఉంది. 11 ముంపు గ్రామాల్లో 7,750 మంది నిర్వాసితులు ఇప్పటికే అదే గ్రామాల్లో ఉన్నారు. రేపు ఒక వేళ కృష్ణానదికి నీరు వచ్చినా ప్రాజెక్టుకు నీళ్లు చేరే పరిస్థితి లేదు. నిర్వాసితులందరూ అక్కడే ఉన్నారు. వాళ్లను బయటకు తీసుకురావాలి. అందుకు కాలనీలు ఏర్పాటుచేయాలి. కాలనీకి భూసేకరణ చేశారు. రోడ్లు వేసి ప్లాట్లు ఏర్పాటు చేశారు. అయితే వీరికి ప్యాకేజీలు ఇస్తే కేటాయించిన స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటారు. ఈ ప్రక్రియ పూర్తికావాలంటే కనీసం ఏడాది పడుతుంది. అన్నిటికన్నా నిధులు కేటాయించాలి. ప్యాకేజీల కోసం రూ.1200 కోట్లు కావాలి. ఇంత మొత్తంలో నిధులు విడుదల చేసే పరిస్థితి లేనందునే గత ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక అడుగు ముందుకు వేయాలంటే తక్షణం ప్యాకేజీలకు నిధులు ఇవ్వాలి. అప్పుడే నిర్వాసితులు కాలనీల్లో ఇళ్లు కట్టుకుని బయటకు వస్తారు. ఇది జరిగితేనే రిజర్వాయర్‌కు నీళ్లు చేరడానికి మార్గం సుగమనం అవుతుంది. వీటితో పాటు రెండో సొరంగం లైనింగు పనులు పూర్తిచేయాలి. మొదటి సొరంగంలోనూ కొంత లైనింగు పనులు పెండింగులో ఉన్నాయి. ఫీడర్ కాలువ 22 కిలోమీటర్ల పొడవునుంది. దీనిలోనూ అసంపూర్తిగానే పనులు మిగిలిఉన్నాయి. జాప్యం జరిగే కొద్ది దీని నిర్మాణవ్యయం కూడా పెరుగుతోంది. ఆనాడు రూ.980 కోట్లతో అంచనా వేయగా ఈ రోజుకు రూ.8,500 కోట్లకు చేరింది. కొత్త పాలకులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

అలుగు ఆక్రమణ.!

(మొదటిపేజీ తరువాయి)

పోరంబోకు భూమి జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ప్రభుత్వ మెడికల్ కళాశాల మార్గం కూడా ఇదే.. అందులోనూ పట్టణ పరిధిలో ఉంది. దీంతో అక్కడ జాతీయ రహదారి ఆనుకుని చ.గ. స్థలం విలువ రూ.25 వేల వరకు ఉంటుందని అంచనా. ఆక్రమిత వాగు పోరంబోకు భూమి సుమారు అర ఎకరంపైగా ఉంటుంది. ఆక్రమిత స్థలం విలువ తక్కువలో తక్కువకున్నా రూ.2 కోట్లకు తగ్గదని అంచనా. ఇంతటి విలువైన ప్రభుత్వ భూములు పట్టపగలే ఆక్రమించి అమ్మకాలతో సొమ్ము చేసుకుంటున్నా... సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కాని ప్రశ్న.?

ప్రజలకు మేలు జరిగేలా కృషి

(మొదటిపేజీ తరువాయి)

లభించిందన్నారు. 2017 ఐఎఎస్ బ్యాచ్‌లో ఎంపికైనప్పటికీ జిల్లా సంయుక్త కలెక్టర్‌గా తొలిసారి బాధ్యతలు చేపట్టానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిన వారిలో బాపట్ల ,చీరాల, రేపల్లె ఆర్డీవోలు జి.రవీందర్ జి. సూర్యనారాయణరెడ్డి, హేలా షారోన్, కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, తహశీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహణ

ప్రజాశక్తి - పొదిలి : మర్రిపూడి ఎస్‌సి కాలనీలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సైడు కాలువల్లో పేరుకు పోయిన డ్రైన్ చెత్తాచెదారాన్ని తొలగించారు. వీధుల్లో పేరుకుపోయిన పారిశుధ్యాన్ని తొలగించి శుభ్రం చేయించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

జిల్లా వనరుల కేంద్రం ఎఒ వెంకట శేషమ్మ

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగిఉండి రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ, జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాశినులు , వేప కషాయం లేదా వేప నూనె లాంటి ప్రకతి వనరులను వినియోగించడంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి వీరంగంధం వెంకట శేషమ్మ తెలిపారు. మండల పరిధిలోని కొండపల్లి రైతు సేవా కేంద్రం వద్ద జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆత్మ 2024-25 ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీ కింద ప్రకతి వ్యవసాయం మరియు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించిన అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ శేషమ్మ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులను విచక్షణా రహితంగా వినియోగించడం వల్ల నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతులకు నికర ఆదాయం తగ్గుతున్నట్లు తెలిపారు. భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు యస్.సుచరిత మాట్లాడుతూ మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువుల వినియోగం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం ప్రకతి వ్యవసాయం మరియు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి ప్రచురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒ ఎ. శైలజారాణి, విఎఎ హైమావతి, రైతులు పాల్గొన్నారు



రైతులకు కర దీపికలు అందజేస్తున్న అధికారులు

విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణంలో విద్యుత్ విజిలెన్స్ ఇఇ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఇఇ పివి. నాగేశ్వరరావు, విజిలెన్స్ సిఐ బిటి. నాయక్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. విద్యుత్ సిబ్బంది 39 బందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1,638 విద్యుత్ సర్వీసులును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యధిక లోడు వినియోగిస్తున్న సర్వీసులును గుర్తించి మాల్ ప్రాక్టీస్ కేసులు, విద్యుత్ చౌర్యం కింద 125 కేసులను నమోదు చేశారు. రూ. 3.47 లక్షల జరిమానాను విధించినట్లు విద్యుత్ శాఖ ఆపరేషన్ ఇఇ నాగేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో మార్కాపురం డిఇఇ ఎస్. సియ్యా నాయక్, గిద్దలూరు సబ్ డివిజన్ డిఇఇ శేషగిరిరావు, విద్యుత్ విజిలెన్స్ డిఇఇ శ్రీనివాసరావు, డివిజన్ పరిధిలోని ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

'జంధ్యాల' విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో బ్రహ్మశ్రీ డాక్టర్ జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జరుగుమల్లి మాజీ జడ్‌పిటిసి దామచర్ల పూర్ణచంద్రరావు, మాగుంట రాఘవరెడ్డి హాజరయ్యారు. తొలుత మాగుంట రాఘవరెడ్డి స్థానిక శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దామచర్ల పూర్ణ చంద్రరావు, మాగుంట రాఘవరెడ్డికి వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాగుట రాఘవరెడ్డి, దామచర్ల పూర్ణచంద్ర రావు మెక్కలు నాటారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, మాజీ ఎంపిపి బెల్లం సత్యన్నారాయణ, పెదబాబు, ఏలూరి రాంబాబు, చదలవాడ బ్రహ్మేంద్రం, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, బత్తిన పూర్ణ, సోమయ్య, రావి నాగేశ్వరరావు, దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తపట్నం

వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత, సురక్షితమైన నీటిని తాగడం వల్ల డయేరియా వ్యాధిని నివారించవచ్చని ఇఒఆర్‌డి బాలచెన్నయ్య తెలిపారు. జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డయేరియా వ్యాధి నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి బాల చెన్నయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులు డయేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సుధీర్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ వైష్ణవి, జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్లు రవి, కేశవరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకుల్లో క్లోరినేషన్

ప్రజాశక్తి-మద్దిపాడు : నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు పంచాయతీ సెక్రెటరీ శివ దుర్గ చెప్పారు. మండల పరిధిలోని నందిపాడు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లో గురువారం క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ బాలకోటయ్య, ఎఎన్ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలు పరిశీలన

ప్రజాశక్తి మద్దిపాడు

మండల పరిధిలోని వెల్లంపల్లి, అన్నంగి గ్రామాల్లో రైతులు సాగుచేసిన పండ్ల తోటలను కేంద్ర జల శక్తి అభియాన్ బందం సభ్యులు దేవదత్తు సేతుపతి ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవదత్తు సేతుపతి మాట్లాడుతూ జామ తోటలలో మొక్కల మొదలు వద్ద కందకాలు తీసి నీటిని అందిస్తే అధిక పంట దిగుబడికి తోడ్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జున్ రావు, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో శ్రీహరి, ఏపీవో ధనుంజయ్ వర్మ, ఈసీ కిషోర్, వెల్లంపల్లి సర్పంచి అనిల్, పంచాయితీ సెక్రటరీ మాధవి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్‌లో తనిఖీ

ప్రజాశక్తి - రాచర్ల

రాచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ వారణాసి గిరిధర్ శర్మ గురువారం తనిఖీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రామ్ నాయక్, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్టూడెంట్ కిట్లు, మెనూ పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కుకింగ్ ఏజెన్సీలకు తగు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి,ఎస్‌టి హక్కుల పరిరక్షణ మండల అధ్యక్షుడిగా 'కాకర్ల'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఎపి ఎస్‌సి,ఎస్‌టి హక్కుల పరిరక్షణ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఎగువచెర్లోపల్లి గ్రామానికి చెందిన కాకర్ల ధనరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ధనరాజు మాట్లాడుతూ హక్కుల పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూదాల గురవయ్య, కార్యదర్శి కాలేటి నాగయ్య, పెద్దారవీడు మండల అధ్యక్షులు పాలేటి పిలిప్, రాష్ట్ర నాయకులు ఉప్పలపాటి నాగయ్య, ఇల్లూరి జయచంద్ర, ఆదిమూలపు అనీల్, పూర్ణకంటి కాశయ్య, పూర్ణకంటి పిచ్చయ్య, పూర్ణకంటి వెంకటయ్య, సింగా నాగేశ్వరరావు, దర్శనం యేసేబు, గోదా ప్రభుదాస్, పోలయ్య, దానయ్య, దానయ్య, రాజయ్య పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని కషి విజ్ఞాన కేంద్రంలో ఫ్యాబ్రిక్ ప్రింటింగ్ అండ్ డైయింగ్ టెక్నిక్స్‌పై నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.కెవికె కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ జి.రమేష్ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణాలో భాగంగా మహిళాలకు డైయింగ్ టెక్నిక్స్‌ని కెవికె గహ విజ్ఞాన నిపుణులు టి.మానస వివరించారు. అనంతరం భాందీని, శిభోరి అండ్ భాతిక్ డైయింగ్ టెక్నిక్స్‌ని ఉపయోగించి తెల్ల కాటన్ చీరలు, చున్నిలపై ఫ్యాబ్రిక్ ప్రింటింగ్‌ను మహిళలతో ప్రత్యేక్షంగా చేయించారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

సిఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చ జరిగేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు, మెగా వాటర్ షెడ్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు, ఫ్లోరిన్ రహిత నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. వైసిపి ప్రభుత్వ పాలనలో జలజీవన్ మిషన్ పథకం కింద మంజూరైన ఇంటింటికి నీటి కుళాయి పథకం పనులు అనేక గ్రామాలలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు 11 కింద మంజూరు చేసిన ఇంటి స్థలాలు ఏ ఒక్కరికి ఇచ్చిన దాఖలాలు లేవు. గ్రామాల్లో ఎక్కడిక్కడే పారిశుధ్యం పేరుకు పోయింది. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు వైద్య సేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. ఇంకా గ్రామాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొన్ని చోట్ల మురుగునీటి కాలువలు లేవు. ఈ సమస్యలపై సభ్యులు సమావేశంలో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌టిసి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

ప్రజాశక్తి-పొదిలి

తమసమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు నిరసన తెలిపారు. పొదిలి డిపో వద్ద గురువారం గేట్ మీటింగ్ బాజీ అధ్యక్షతన నిర్వహించారు. డిపో జాయింట్ సెక్రెటరీ దివాకర్ మాట్లాడుతూ త్వరితగతిన డ్యూటీ చార్ట్‌లు వేసి కండక్టర్, డ్రైవర్లకు లీవ్ పొజిషన్ కల్పించాలన్నారు. అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కె. బాషా మాట్లాడుతూ సూపరింటెండెంట్ ధనమ్మ ఏకపక్షంగా ఓ యూనియన్‌కు కొమ్ముకాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యదర్శి పి.ఓబులేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను డిపిటిఒ దష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని తెలిపారు. ఈ నెల 15 నుంచి పై నాయకత్వ సూచన మేరకు కార్యచరణను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

బాధితులకు దద్దాల పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

ప్రజాశక్తి -పామూరు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని చెంచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాసు వెంకటేశ్వర్లు, నరమారేళ్ల గ్రామానికి చెందిన గుంటుపల్లి సుబ్బరాయుడును వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నారాయణ యాదవ్ వెంట జడ్‌పిటిసి చప్పిడి సుబ్బయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ చాంద్ బాషా, నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, గట్ల విజయభాస్కర్ రెడ్డి, పామూరు టౌన్ సచివాలయ కన్వీనర్ గయాజ్, ఎంపిటిసి యేసురత్నం, కనిగిరి నియోజకవర్గ ఎస్‌సి నాయకుడు కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలు రెడ్డి, గొబ్బెల్ల శ్రీను వెంకటేశ్వర రెడ్డి, చిన్న పెద్దయ్య, సామేలు, దావీదు, జాన్, కమతం రమణారెడ్డి డబ్బుకొట్టు వెంకటేశ్వర్లు ఉన్నారు.

కౌలు రైతు కార్డుల జారీపై అవగాహన



మాట్లాడుతున్న ఉప కలెక్టర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి -మార్కాపురం రూరల్

అర్హత కలిగిన ప్రతి కౌలురైతు కౌలు గుర్తింపు కార్డులు పొందాలని ఉప కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూశాఖల సంయుక్త ఆధ్వర్యంలో క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డుల జారీ ప్రక్రియపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ 11నెలల కాలవ్యవధితో కూడిన సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలుదారులకు రైతుభరోసా వర్తిస్తుందన్నారు. ఈక్రాప్ నమోదుచేయించుకుని పంటనష్టం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందవచ్చునని చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ బాలాజీ నాయక్, ఎఒ దేవిరెడ్డి శ్రీనివాసులు, డిటీ శ్రీనివాసులు, విఆర్‌ఒలు, విఎఎలు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు సిద్ధార్ధ, ఎఒ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కౌలు రైతు కార్డుల జారీపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సిసిఆర్‌సి చట్టం ప్రకారం మండలం లోని ప్రతి కౌలు రైతుకు తప్పనిసరిగా కౌలు కార్డు ఇవ్వాలని సూచించారు. గిద్దలూరు మండలంలో 1461 సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి అర్హులకు కౌలు రైతు కార్డులు ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సుబ్బారావు, ఆర్‌ఐ, వ్యవసాయ విస్తరణ అధికారి,గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : పంట సాగు, హక్కు పత్రాలపై గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు ఎస్‌ఎం.హమ్మద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పంట సాగు, పత్రాల గురించి రైతులకు అవగాహనా కల్పించారు. ఎస్‌సి,ఎస్‌టి సన్న, చిన్న కారు రైతులను గుర్తించి పత్రాలను మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ డి.జవహర్‌లాల్ నాయక్, ఆర్‌ఐ నాగేశ్వరరావు, విఆర్‌ఒలు గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యన సహాయకులు, పట్టు సహాయకులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : కౌలు రైతులకు భూమిపై ఎలాంటి హక్కులు ఉండవని కేవలం పండించే పంట మీదే హక్కు ఉంటుందని తహశీల్దారు చక్రవర్తి తెలిపారు. రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పంట సాగు పత్రాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ విఆర్‌ఒ, విఎఎ, విహెచ్‌ఎలు నిజమైన కౌలు రైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలన్నారు.

వెంకటేశ్వర కాలనీలో చోరీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఓ ఇంట్లో గురువారం చోరీ జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. వెంకటేశ్వర కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న దాసరి కోటేష్ తమ సొంత గ్రామమైన శానంపూడికి బుధవారం రాత్రి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని సామగ్రి చెల్లా చెదురుగా పడిఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లుగా పోలీసులు సమాచారం అందించారు. ఎస్‌ఐ టి.శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎఎస్‌ఐ మహబూబ్‌బాషా, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, లింగం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మూడు సవర్ల బంగారపు దారం, ఒకటిన్నర సవర చైను, వెండి వస్తువులు, రూ.6500 నగదు చోరీకి గురైనట్లు బాధితుడు దాసరి కోటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒంగోలు నుంచి క్లూస్ టీం ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- పిసిపల్లి

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని ఎంఇఒ-2 ఆర్.శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని చింతగుంపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన బిల్డర్ పోలిశెట్టి చౌడయ్య ఆర్థిక సాయంలో ఎంఇఒ-1 జి. సంజీవ్ ,ఆర్.శ్రీనివాసులు చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం నోటు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికష్ణ, ఉపాధ్యాయుడు బాజీ, దాత పోలిశెట్టి చౌడయ్య, పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహుకరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వికలాంగ విద్యార్థులు తమ తల్లిదండ్రులు సహకారంతో ఆ పాఠశాలకు గురువారం బీరువాను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేముల పిచ్చిరావు, ఎంఇఒలు ఆంజనేయులు, మల్లూ నాయక్, స్పెషల్ ఎడ్యుకేటర్ షేక్ సాదిక్ ,ఉపాధ్యాయులు నాగరాణి, శేషారావు, నందగోపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు డెంగీ నివారణపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యజ్ఞినిక్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షా కాలంలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల ద్వారా డెంగీ, వివిధ ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాసర్‌రెడ్డి, ఎంఇఒ మస్తాన్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఇజ్రాయేలు, సూరేకుమారి, రమేష్, సత్యనారాయణరెడ్డి, ఆశా కార్యకర్తలు కాశి, ఈశ్వరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నీటి కష్టాలు అనే శీర్షికతో ఈ నెల 10న ప్రజాశక్తి దినపత్రికలో ఓ వార్త ప్రచురితమైంది. ఆ వార్తకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి డి.అమరసుబ్బయ్య స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నాలుగు బోర్లు ఉన్నాయని, అందులో రెండు బోర్లు పూర్తిగా ఎండిపోయినట్లు తెలిపారు. మిగతా బోర్లలో కొద్ది మేరు నీరు వస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ నాలుగు ట్యాంకర్ల నీటి సరఫరా తెప్పిస్తున్నట్లు తెలిపారు. ఐటిడిఎ శ్రీశైలం వారి ద్వారా గురుకులం సెక్రటరీకి ప్రతిపాదనలు పంపి పాఠశాలలో శాశ్విత నీటి పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పసుపు రైతులకు ప్రభుత్వం ఊరట

◆ కోల్డుస్టోరేజీ అగ్నిప్రమాద బాధితులకు పరిహారం ◆ రైతు సంఘం కృషితో మంత్రుల సానుకూల స్పందన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది జనవరి 19న గుంటూరు జిల్లా దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపు పూర్తిగా దగ్ధమై రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు అప్పటి వైసిపి ప్రభుత్వం గానీ, కోల్డ్ స్టోరేజీ యజమాని గాని, అధికారులు గానీ పట్టించుకోలేదు. రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టినప్పటికీ అప్పటి ప్రభుత్వ అధికారులు కోల్డ్ స్టోరేజ్ యజమానికే వత్తాసు పలికారే తప్ప రైతులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు. దీని కోసం రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండగా వైసీపీ ఓడిపోయి టిడిపి కూటమి అధికారం చేపట్టింది. దీంతో రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు, బాధ్యత రైతులు వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రైతులను, రైతు నాయకులను, కొందరు మంత్రులతో కలిసి జరిగిన నష్టాన్ని సంబంధిత ఉన్నతాధికారుల ద్వారా తెలుసుకొని దీనిపై చర్చించారు. ఈ చర్చల్లో మంత్రి నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, అచ్చం నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్లతో ఆనందబాబు చర్చించారు. రైతులకు న్యాయం చేయాలని వివరించారు. స్పందించిన మంత్రులు నష్టపోయిన రైతులకు క్వింటాకు రూ.7వేల చొప్పున ప్రభుత్వం ద్వారా అందజేసే విధంగా హామీలు ఇచ్చినట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య తెలిపారు. గత ప్రభుత్వం పసుపు ద్వారా రూ.కోట్లు నష్టపోయిన రైతులను ఆదుకోవటంలో విఫలం చెందిందని ఆరోపించారు. టిడిపి నూతన ప్రభుత్వం రైతు సమస్యలను సమీక్షించి పరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కోల్డ్ స్టోరేజ్లో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో పసుపు క్వింటా ధర రూ.12,500 ఉన్నట్లుగా అప్పటి అధికారులు నమోదు చేశారని, అయినప్పటికీ జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి రూ.7వేలు అందించడానికి సిద్ధపడటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ అంశాన్ని వివరించారు. ఈ నష్టపరిహారం అందించేందుకు కృషిచేసిన ఆనందబాబు, నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, అచ్చం నాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అప్పటి తెనాలి సబ్ కలెక్టర్ ప్రక్కర్ జైన్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కె రామస్వామి, నాయకులు ఎం సత్యనారాయణ, జి నాగరాజు, బి సుబ్బారావు, బాధిత రైతులు నాదెండ్ల సురేంద్ర, ఈడుపుగంటి రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామయ్య


ఎమ్మెల్యే కొండయ్యకు విశాఖలో ఘన స్వాగతం

ఎమ్మెల్యే కొండయ్యకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - చీరాల

శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్యకు విశాఖపట్నం ఎయిర్ పోర్టు నుండి ఆర్కే టౌన్ షిప్ ప్రతినిధులు గురువారం ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఎమ్మెల్యే కొండయ్యకు ఆయన తనయుడు గౌరీ అమర్నాథ్ ఘన స్వాగతం పలికి వాహనాలతో విశాఖ నగరంలో ర్యాలీ నిర్వహించారు. శాసన సభ్యునిగా గెలుపుపొందాక తొలిసారి విశాఖపట్నం వెళ్ళటంతో ఆర్కే టౌన్షిప్ గాజువాక సిటీ బ్రాంచ్ మేనేజర్, సభ్యులు విశాఖపట్నం విమానాశ్రయం నుండి ఆర్కే టౌన్షిప్ సిటీ సెంటర్ బ్రాంచ్ వరకు భారీ ర్యాలీగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్కే టౌన్షిప్ సిటీ బ్రాంచ్, గాజువాక బ్రాంచ్ మేనేజర్స్, మార్కెటింగ్ స్టాఫ్, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొన్నారు.


విద్యా కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కర్లపాలెం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. మండలంలోని యాజలి జెడ్పి ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్ తదితర కిట్లను ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో ప్రతి విద్యార్థికి ఒక కిట్ అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాగ్, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, టై, బెల్ట్, షఉ తదితరాలు అన్నీ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భూపతిరావు, నాయకులు పేరలి బాల కృష్ణమూర్తి, బుల్లియ్య, ఏసోబు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యోన్నతి ఫౌండేషన్ స్కాలర్షిప్పులు బహూకరణ

ప్రజాశక్తి - పంగులూరు

ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి స్మారక ఉపకార వేతన ప్రధానోత్సవం ఈనెల 12న శుక్రవారం అద్దంకిలోని కాకానిపాలెం జెడ్పి ఉన్నత పాఠశాల్లో జరుగుతుందని విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ గురువారం తెలిపారు. డాక్టర్ దూళిపాళ్ల షర్మిల ప్రియాంక సౌజన్యంతో 10వ తరగతి ఉత్తీర్ణులైన 30మంది యోగ్యత కలిగిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.3లక్షలు బహుకరిస్తున్నట్లు తెలిపారు. జె పంగులూరు, అద్దంకి, ఇంకొల్లు మండలాలకు చెందిన విద్యార్థులకు గత ఫిబ్రవరి 11న టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రతిభ పరీక్షలో మొదటి ఐదు స్థానాలు సాధించిన 15 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి 2024 - 26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ చదువు కోవటానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు, సరైన ప్రణాళిక రూపొందించుకునేందుకు వీలుగా విద్యార్థులకు చెప్పేందుకు కొంత మంది అనుభవజ్ఞులను ఆహ్వానించినట్లు తెలిపారు.

ఓడరేవులో పర్యాటకులను అనుమతించాలి

ప్రజాశక్తి - చీరాల

ఇటీవల కాలంలో సముద్ర తీర ప్రాంతంలో కొందరు యువకులు ప్రమాదవశాత్తు మరణించడం వల్ల సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులను ప్రభుత్వ ఆపివేసిందని సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, ఎం వసంతరావు, చేతి వృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి కొండయ్య పేర్కొన్నారు. వాడరేవు సముద్ర స్నానాలకు ప్రసిద్ధి చెందిన రేవు కావడం, స్నానాలకు అనువైన ప్రాంతం కావడంతో పెద్ద సంఖ్యలో పర్యటకులు వస్తుం టారని తెలిపారు. అనేక మంది హిందువులు క్రతువులు, నిద్ర చేయడం వంటి సాంప్రదాయం ఓడరేవులో సముద్ర ఒడ్డున నిర్వహించడం ఆనవాయితీ ఉంటుందని తెలిపారు. ముస్లింలు సైతం మొక్కులు చెల్లించడానికి వస్తూ ఉంటారు. అయితే ఇటీవల కొంతమంది యువకులు అజాగ్రత్తగా, ఎక్కువ ప్రైవసీ కోసం నిర్మానుష్య ప్రాంతాల్లో, ఎక్కువ లోతు, ఎక్కువ అలల తాకిడి ఉండే ప్రాంతాల్లో మునిగి ప్రమాదానికి గురైన ఘటనలు ఆందోళన కలిగించాయని తెలిపారు. ఇలాంటి ఘటనల నివారణకు పోలీసు వాచ్ టవర్స్ ఏర్పాటు చేసి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా పర్యవేక్షించాలని కోరారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయడంతో పాటు నీటి డ్రోన్లను అందుబాటులో ఉంచడం ద్వారా ప్రమాదానికి గురైయ్యే వారిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి అవసరమైన జాగ్రత్తలు తీసుకుని పర్యాటకుల సముద్ర స్నానానికి అనువుగా గుర్తించిన ప్రాంతంలో అనుమతించాలని కోరారు. సముద్ర తీరానికి వచ్చే వారిని నిషేధించడం వల్ల పర్యాటక రంగంపై ఆధారపడ్డ వాళ్ల ఉపాధి దెబ్బతిని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ట్రిపుల్ ఐటిలో బాలికలదే పై చేయి


కుంచాల మనీషా


పాదిలి లలిత శ్రీ


ఉన్నం ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - మెదరమెట్ల

త్రిబుల్ ఐటీ సీట్ల ఎంపికలో కోరిసపాడు జెడ్పి ఉన్నత పాఠశాల బాలికలదే పై చేయిగా నిలిచింది. పాఠశాల నుండి కుంచాల మనీషా ఒంగోలులో, ఉన్నం ఉమామహేశ్వరి నూజివీడు త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించగా రావినూతల జడ్పీ హైస్కూల్ నుండి పొదిలి లలితాశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటిలోసీటు సంపాదించారు. విద్యార్థులను ఎంఇఒ ఎల్ పున్నయ్య, పాఠశాల హెచ్ఎం అంజయ్య, కంచర్ల పోతురాజు, పాఠశాల సిబ్బంది, రావి నూతల పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు అభినం దించారు. విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదువుకుని త్రిబుల్ ఐటీల్లో సీట్లు సంపాదించాలని సూచించారు.

వేటపాలెం : మండలంలోని పందిళ్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించారు. తమ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించడంపట్ల పాఠశాల హెచ్ఎం ఎం శేఖరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలకు చెందిన పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ములకల శ్యామల, కోణంకి భార్గవ్ నూజివీడు ఐఐఐటిలోను, వంగర రోహిణి, ఆశోది హర్ష, సజ్జ శివ సాయి శ్రావణ్ ఒంగోలు ఐఐఐటిలోను సీట్లు సాధించినట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులతోపాటు గ్రామస్థులు అభినందించారు.


కంచర్ల రాహుల్


గొరిగపూడి కీర్తన


తెనాలి స్టీవెన్‌పాల్

భట్టిప్రోలు : మండలంలోని పెసర్లంక డీకే జెడ్పి ఉన్నత పాఠశాల్లో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు లభించినట్లు పాఠశాల హెచ్ఎం సుభాని తెలిపారు. పాఠశాలకు చెందిన కంచర్ల రాహుల్ నూజివీడు క్యాంపస్‌కు, గొరిగిపూడి కీర్తన, తెనాలి స్టీవెన్ పాల్ ఒంగోల్ క్యాంపస్‌కు ఎంపికైనట్లు చెప్పారు. సీట్లు సాధించిన విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.


ఆసోదిహర్ష


వంగర రోహిణి


కోనంకి భార్గవ్


ములకల శ్యామల


సజ్జ శివ సాయి శ్రావణ్


విద్యా కిట్లు అందజేస్తున్న డిసిఎంఒ శ్రీనివాసరెడ్డి

పిల్లల్ని బడిలో చేర్చాలి

ప్రజాశక్తి - పర్చూరు

బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ఇందిరా కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎన్‌రోల్మెంట్‌ను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "నేను బడికి పోతా" కార్యక్రమాన్ని శ్రద్ధగా నిర్వహించాలని కోరారు. పాఠశాలలో సిద్ధంగా ఉన్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులు అందరికి అందించారు. కార్యక్రమంలో ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్, ఎంఇఓ వెంకటరామయ్య, హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయుడు చింపారెడ్డి, ఎన్యుమరేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎంపిడిఒ శివసుబ్రమణ్యం

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శుల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ శివ సుబ్రహ్మాణ్యం మాట్లాడుతూ పిఎం విశ్వకర్మ పథకం, ఇంటి పన్నుల రివిజన్, పిఎం ఒన్ యాప్, జాతీయ పంచాయతీ అవార్డులపై పంచాయతీలో చర్చించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. గ్రామాల్లో డేరియా ప్రబల కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, నాగేష్, శివ ప్రసాద్, శరత్, రాణి, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

అడుగంటిన చెరువులు

పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తాగునీటి సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. యర్రగొండపాలెం సబ్ డివిజన్లోని పెద్దారవీడు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లోని 48 నివాస గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసేందుకు త్రిపురాంతకం మండలంలోని దూపాడు వద్ద తాగునీటి చెరువులు (సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు) ఏర్పాటు చేశారు. వీటిని సాగర్ జలాలతో నింపి ఆయా ప్రాంతాలకు సాగర్ నీటిని సరఫరా చేస్తారు. గతేడాది సాగర్ జలాలతో వీటిని నింపకపోవడంతో చెరువుల్లో నీరు అడుగంటింది. దీంతో క్షేత్ర స్థాయిలో నీటి సమస్య తీవ్రం కావడంతో అదికారులు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సుమారు 15 రోజుల పాటు సాగర్ జలాలు విడుదల చేశారు. కాలువకు నిరంతరాయంగా నీరొస్తే చెరువుకు నీరు చేరేలా వాటిని డిజైన్ చేశారు. ఈ కారణంగా మూడు నెలల పాటు కాలువలకు నీరొస్తే తప్ప ట్యాంకులు పూర్తి స్థాయిలో నిండవు. అయితే తాగునీటి చెరువులను నింపేందుకు పది రోజుల పాటు మాత్రమే సాగర్ జలాలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మోటార్లు ఏర్పాటు చేసి చెరువులను కొంతమేర నింపారు. వాటికి కొంత మేర నీరు చేరడంతో వ్యవధిలో చెరువులు నిండకపోవడంతో రెండు నెలలకు ఎస్ ఎస్ ట్యాంకులు అడుగంటాయి.యర్రగొండపాలెం మండలానికి నీటిని సరఫరా చేసే చెరువు పూర్తి సామర్థ్యం 746ఎం ఎల్ కాగా ప్రస్తుతం చెరువులో 200 ఎం ఎల్ నీటి మట్టం నీరు మాత్రమే ఉంది.త్రిపురాంతకం మండలానికి నీటిని సరఫరా చేసే చెరువు నీటి మట్టం 420ఎంఎల్ కాగా ప్రస్తుతం 150 ఎంఎల్ నీటి మట్టం,పెద్దారవీడు మండలానికి నీటిని సరఫరా చేసే చెరువు నీటిమట్టం 1156 ఎంఎల్ కాగా 200 ఎంఎల్ నీటి మట్టం మాత్రమే ఉన్నాయి.



అడుగంటిన దూపాడు చెరువు

పొంచి ఉన్న ప్రమాద ఘంటికలు

పెద్దారవీడు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లోని గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి చెరువుల్లో సైతం జలాలు పూర్తి స్థాయిలో అడుగంటాయి. దూపాడు వద్ద సాగర్ కాలువ జలాలపై ఆధారపడి నిర్మించిన పాత దూపాడు పథకం, నడిగడ్డ జలాశయానికి నీటి ఎద్దడి పొంచి ఉంది. శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతవా సులకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు.వర్షాలు కురిసే పరిస్థితి కనిపించడం లేదు.సాగర్ నీటి చెరువులు కూడా ఎండిపోతే నీటి కోసం తీవ్ర ఇబ్బందులు తప్పవు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

పుట్టినరోజు వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

దర్శి ఎఎంసి మాజీ చైర్మన్ కెవి.రెడ్డి మనవడు కార్తీక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని కార్తీక్‌రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపిపి గొల్లపాటి సుధారాణి, అచ్చయ్య, నాయకులు సద్ది పుల్లారెడ్డి, ముండ్లమూరు జెడ్‌పిటిసి రత్నంరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు

ప్రజాశక్తి- పిసిపల్లి

మండలంలో మొత్తం 21 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు ఎంఇఒలు శ్రీనివాసులు, సంజీవులు తెలిపారు. పిసిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో ఏడుగురు ,గుంటుపల్లి హైస్కూల్‌లో నలుగురు ,పెద ఇర్లపాడులో ముగ్గురు ,కేజీబీవీలో ఇద్దరు, నేరేడుపల్లి నుండి ఇద్దరు ,మురుగుమ్మిలో ఒకరు ,పెద్ద అలవలపాడు ఒకరు త్రిపుల్ ఐటిలో సీటు సాధించినట్లు ఆయన తెలిపారు. ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఎంఇఒలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన కందుకూరి సుమశ్రీ, గోళ్ళ సాత్విక్ ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించి తమ సత్తా చాటారు. కందుకూరి సుమశ్రీ కి నూజివీడు, సాత్విక్ కు ఒంగోలు త్రిపుల్ ఐటి కళాశాలలో సీటు వచ్చింది. త్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. శివరామ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. 10వ తరగతిలో సుమశ్రీ 587 మార్కులతో జిల్లాలో మూడు స్థానం, మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది.ఎపి ఆర్‌జెసిలో 272వ ర్యాంకు సాధించింది. సాత్విక్ 10వ తరగతిలో 565 మార్కులు సాధించాడు.

కొమరోలు : స్థానిక సర్వెంట్ ఇంగ్లీష్ హైస్కూల్‌కు ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించారు. చంద్రవంశీ ఒంగోలు, ఆర్. సూరజ్, యు.అజయ్ నూజివీడు త్రిపుల్ ఐటి కళాశాలలో సీటు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ ఫ్లోరామేరీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మద్దిపాడు : మండల పరిధిలోని ఇనమనమెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన చందలూరి సాయి భార్గవ్ ట్రిపుల్ ఐటిలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. నాగకళ్యాణి తెలిపారు. సాయిభార్గవ్ పదోతరగతిలో 573 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఆమె తెలిపారు. సాయిభార్గవ్ శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటి కాలేజీలో సీటు సాధించినట్లు ఆమె తెలిపారు.

జనాభా దినోత్సవం

ప్రజాశక్తి- కనిగిరి

స్థానిక కాశిరెడ్డి కాలనీలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సజన ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం జూలై 11న ఐక్యరాజ్యసమితి ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఎఎన్ఎ లక్ష్మి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, జిఎస్అండ్‌జిడి క ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.నవ కుమార్ ఆశా కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ముత్తుముల

ప్రజాశక్తి – గిద్దలూరు

ఏపీ సచివాలయంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డిని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి వారికి అభినందనలు తెలిపారు.

మంత్రిని కలిసిన గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను టిడిపి, జనసేన, బిజెపి కూటమి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి చాంబర్ ప్రారంభోత్సవంలో పాల్గొని మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇఒఆర్‌డి

ప్రజాశక్తి-దర్శి

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని దర్శి ఇఒఆర్‌డి శోభన్‌బాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివద్ధి గురించి ఎమ్మెల్యేతో చర్చించినట్లు ఇఒఆర్‌డి తెలిపారు.

ఐజిని కలిసిన లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి: గుంటూరు రేంజ్ ఐజి త్రిపాటిని టిడిపి, జనసేన, బిజెపి కూటమి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరులోని డిఐజి క్యాంప్ కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-జరుగుమల్లి

ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన అందించాలని డిఇఒ సుభద్ర తెలిపారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. నాడు–నేడు పనుల ప్రగతి పాఠశాల, విద్యార్థుల హాజరు తనిఖీ చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కారియర్ ఎడ్యుకేషన్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిపినందుకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు బి.నరశింగరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బత్తల నాగేంద్రవదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

న్యాయమూర్తి కె.భరత్ చంద్ర

ప్రజాశక్తి -కనిగిరి

ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెల్ ధరించాలని న్యాయమూర్తి కె.భరత్ చంద్ర తెలిపారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి కె.భరత్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం బైకు ర్యాలీ నిర్వహించారు. కోర్టు సెంటర్ నుంచి ఆర్‌టిసి డిపో,ప్రధాన కూడళ్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రైడర్లు మాత్రమే కాకుండా పిలియన్ రైడర్లు కూడా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించుకొని తమ ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. హెల్మెట్ భారం కాదని అది మన బాధ్యత అని తెలిపారు.మోటారు వాహనాల చట్టం పై అవగాహన కలిగిస్తూ రైడర్‌తో పాటు పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు.రోడ్డు భద్రతా నిబంధనలను పాటించనివారికి రూ.1000 జరిమానా విధించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ, పోలీస్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కోర్టు సిబ్బంది, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.



బైకుర్యాలీలో పాల్గొన్న జడ్జి భరత్ చంద్ర

ముగిసిన తాళాల రచ్చ

రికార్డులు స్వాధీనం చేసుకున్న పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీలో గత కొన్ని రోజులుగా సాగుతున్న తాళాల రచ్చకు గురువారం ముగింపు పడింది. జూనియర్ ఆసిసెంట్ గదికి తాళాలు మీద తాళాలు వేసిన విషయం తెలిసిందే.జిల్లా పంచాయతీ అధికారుల ఆగ్రహంతో స్థానిక అధికారులు తాళాలు పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి టి.ఉషారాణి జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు పగలగొట్టి రికార్డు స్వాధీనం చేసుకోవాలని, లేక పోతే మీపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రామకోటయ్యను హెచ్చరించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య ఈ విషయాన్ని ఎంపిడిఒ నగేష్ కుమారి దష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపిడిఒ పోలీసు రెవెన్యూ అధికారుల సమక్షంలో రూము తాళాలు పగలగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని సూచించారు. దీంతో ఎస్ఐ శ్రీరామ్, ఇఒఆర్‌డి సుధాకర్ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు పగలగొట్టారు. వీడియో రికార్డింగ్ ద్వారా ఆ గదిలో ఉన్న రికార్డులను కార్యదర్శి స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాల మేరకు జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



తాళాలు పగులగొడుతున్న సిబ్బంది

అధిక జనాభా దేశప్రగతికి అవరోధం



ర్యాలి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి కలెక్టర్ జె వెంకట మురళి, ఎంఎల్ఎ వేగేశన నరేంద్రవర్మ, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జెవి రమణ మాట్లాడుతూ అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధమని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, కుటుంబం అభివృద్ధి చెందాలన్నా జనాభా నియంత్రణ ప్రధానమని అన్నారు. అధిక జనాభా పర్యావరణ వ్యవస్థకు, మానవాళి పురోగతికి తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందని అన్నారు. జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎంఎల్ఎ నరేంద్రవర్మ మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని అన్నారు. మేమిద్దరం, మాకు ఒక్కరని కుటుంబ నియంత్రణ పాటిస్తే ఆరోగ్యమైన కుటుంబం సాధ్యమని అన్నారు. కుటుంబ నియంత్రణలో మగవారి పాత్ర ముఖ్యమని, జనాభా సమస్య ప్రాముఖ్యతను గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి, ఎవివి హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిఎస్కె కాలేజీ ఆఫ్ నర్సింగ్, సుశీల స్కూల్ ఆఫ్ నర్సింగ్, జిఎన్ఎం విద్యార్థినిలు, రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

యద్దనపూడి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ పాటించాలని అన్నారు. కాన్పు, కాన్పుకు మధ్య ఎడం ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలు చేసుకోరాదని చెప్పారు. కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యమని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రసాద్, సూపర్ వైజర్లు నాగేశ్వరరావు, సునంద, రారాజు, చంద్రశేఖర్, విమల, ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు, గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది



బస్టాండులో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఆర్టీసీ బస్టాండులో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఆర్టీసీ బస్టాండులో మెరైన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. బస్టాండు పరిసర ప్రాంతాల్లో అనుమానితులను విచారించారు. సందర్భంగా మెరైన్ సీఐ సురేష్ కుమార్ మాట్లాడుతూ సాగర్ కవచ్‌లో భాగంగా గుర్తు తెలియని గుర్తించేందుకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామని అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో రక్షణ చర్యల్లో భాగంగా చొరబాట్ల నివారణకు సిబ్బందిని, ప్రజలను సిద్ధంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సముద్ర తీర పట్టణాలు, గ్రామాల్లో సాగర్ కవచ్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ, ఎఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.



పాఠశాల్లో మొక్కల పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కోవి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా పాఠశాల్లోని విద్యార్థినీ, విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులకు రూ.10వేల విలువైన 120 మొక్కలను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మొక్కలు ఇవ్వడం ఎంత విలువైనదో వాటిని జాగ్రత్తగా పెంచడం అంతకన్నా విలువైనదని అన్నారు. ప్రతి పిల్లవాడు మొక్కలను జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ఈ చిన్న మొక్కే రేపు ఎంతో మందికి నీడ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామా నాగేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, పొత్తూరి వెంకటరావు, కురుగంటి హనుమంతరావు, వరికూటి సుబ్బారావు, కోవి శ్రీనివాసరావు బాల్య మిత్రుడు నాగసూరి సుబ్బారావు శుభాకాంక్షలు తెలిపారు.



ట్రాక్ మరమ్మతులు కోసం ఫైర్ స్టేషన్ రైల్వే గెట్ బంద్

20 వరకు ఫైర్ స్టేషన్ గేట్ మూసివేత

ప్రజాశక్తి - చీరాల

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురున్న ఫైర్ స్టేషన్ రైల్వే గెట్ ట్రాక్ మరమ్మత్తుల కారణంగా ఈనెల 12 నుండి 20వరకు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ప్రత్యామ్నాయంగా స్వర్ణ రైల్వే గేటును ఉపయోగించు కోవాలని సూచించారు. మరమ్మతులు అత్యవసరమైనం దున ప్రజలు అర్థం చేసుకుని తమకు సహకరించాలని కోరారు. గేటు మూసివేత సమాచారాన్ని తహసీల్దారు తెలిపారు.

'ఎస్ఐ అన్యాయం చేశాడు..'

ప్రజాశక్తి - పంగులూరు

తన పొలం విషయంలో రేణింగవరం ఎస్ఐ తీవ్రమైన అన్యాయం చేశారని, ఆరికట్ల వారిపాలెం గ్రామానికి చెందిన తానికొండ సుధాకర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలంలో అక్రమంగా పైరు పీకేసిన వ్యక్తులను శిక్షించకుండా వారికి అండగా నిలుస్తూ కాలయాపన చేశాడని, తనకు న్యాయం జరగకుండా చేశాడని లిఖిత పూర్వకంగా ఆరోపించారు. గ్రామంలో తాతల కాలం నుండి సంక్రమించిన భూమిని తాము సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అందులో తనకు 13సెంట్లు భూమి వాటా వచ్చిందని చెప్పారు. ఆ భూమిలో తాను శనగ పంట సాగు చేశానని అన్నారు. పంట కోతకు వచ్చే సమయంలో పక్క పొలం వ్యక్తి తానికొండ దయాశేకర్ తన భూమిలోని పంటను అక్రమంగా కొంత కోసుకున్నాడని చెప్పారు. ఈ మేరకు గత ఫిబ్రవరి 15న రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పాడు. ఫిర్యాదు చేసిన 42రోజుల వరకు తనపై ఎస్ఐ విషయం పట్టించుకోలేదని అన్నారు. చివరికి చీరాల డిఎస్పికి, అద్దంకి రూరల్ సీఐకి చెప్పిన తరువాత ఎస్ఐ తిరుపతి రావు భూమిని పరిశీలించి, సర్వేయర్ చేత కొలిపించమన్నాడని చెప్పారు. తాము ఆయన చెప్పిన విధంగా సర్వేయర్ చేత కొలిపించామని అన్నారు. తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని ఎస్ఐకి చెబితే దయాశేఖర్‌పై బైండోవర్ కేసు పెడతానని, నష్ట పరిహారం కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చాడని చెప్పారు. ఇంతవరకు దయాశేఖర్‌పై బైండవర్ కేస్ కానీ, నష్టపరిహారం ఇప్పిం చడం కానీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట కేస్ పెట్టి ఇప్పటికీ 178రోజులు అవుతున్న ఇప్పటికీ పోలీసులవైపు నుంచి తనకు ఎలాంటి సహకారం, ప్రత్యర్థిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ విషయమై రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతి రావును ప్రజాశక్తి వివరణ కోరగా తాను ఆ రోజే దయా శేఖర్‌పై కేసు పెడతానని అన్నానని, సుధాకర్ కేసు వద్ద న్నాడని ఎస్ఐ తెలిపారు. నష్ట పరిహారం ఇప్పించటం తన పని కాదని అన్నారు. అయితే బైండ్ వర్ కేసు రేపు ఉద యం 10 గంటలకు అలా పెట్టి తహశీల్దారుకు అప్పగిస్తా రని ఎస్ఐ తెలిపారు. తనపై సుధాకర్ లేలిపోని ఆరోపణ లు చేస్తున్నాడని, ఆరోపణలో నిజం లేదని ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు.



రాయితీపై నిత్యవసర సరుకులు అందజేస్తున్న నాయకులు

నిత్యావసర సరుకుల కౌంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - వేమూరు

స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నందు తగ్గింపు ధరలపై నిత్యవసర సరుకుల విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు టిడిపి అధికార ప్రతినిధి, ఎఎంసి మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లో రాయితీపై సరకులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని అన్నారు. పేదలు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఎన్నడు లేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రజలను ఆదరించాలనే దృక్పథంతో ధరలు తగ్గించి కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్లో కేజీ కందిపప్పు రూ.180 ఉండగా రాయితీపై రూ.160కి, సన్న రకం బియ్యం కేజీ రూ.52 ఉండగా రూ.48కి, స్టీమ్ బియ్యం రూ.55.85 ఉండగా రూ.49కి అందజేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ధరలు తగ్గించి పేదల పక్షాన నిలబడే ప్రభుత్వంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి ఊసా రాజేష్, డిప్యూటీ తహశీల్దారు కనకదుర్గ, పౌరసరఫరాల శాఖ అధికారులు, తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులు పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండ్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ డైరెక్టర్ దేవీదత్త శాంతిపతి అన్నారు. మండలంలోని పూరిమెట్ల గ్రామంలో రూ.1.05లక్షలతో ఉపాధి పథకం ద్వారా నిర్మించిన సేద్యపు నీటి కుంటను కేంద్ర బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో విరివిగా ఫారం పాండ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులు తమ పొలాల్లోని సరిహద్దుల్లో కందకాలు తవ్వి గట్ల మీద మొక్కలు నాటాలని అన్నారు. తద్వారా భూమి తేమ సంరక్షణ ఎక్కువగా ఉంటుందని అన్నారు. రైతులు పొలాల్లో ప్రభుత్వ పథకాల ద్వారా పండ్ల తోటలు పెంచుకోవాలని అన్నారు. జలశక్తి అభి యాన్, భూగర్భ జల శాస్త్రవేత్త సంతోష్ గౌతమ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి అర్జునరావు, ఎపిడి నిర్మల, ఎపిఒ ఎం అండ్ ఈ కె మధుసూదనరావు, ఎంపిడిఒ బి జనార్ధన్, ఈఒ పిఆర్‌డి శ్రీదేవి, ఎపిఒ కె నాగరాజు, ఈసీ శివరామకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృంధం ప్రతినిధి



ట్రాక్టర్‌తో స్మశాన వాటికకు మట్టిని తరలింపు

శ్మశానవాటికకు ఉచితంగా మెరక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక అద్దేపల్లి పద్మశాలీయ చెరువులో తీస్తున్న మట్టి నుండి అద్దేపల్లి స్మశాన వాటికకు ఉచితంగా మెరక తోలించారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సహకారంతో పల్లపు ప్రాంతంగా ఉన్న స్మశాన వాటికకు చెరువు నుండి మట్టిని తోలించడం పట్ల ఆ ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలిపారు. మట్టి తరలింపును స్థానిక రైతు సంఘం నాయకులు కుందేటి శివన్నారాయణ ఆధ్వర్యంలో చేపట్టగా దానిని బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు, టిడిపి మాజీ మండల కన్వీనర్ వై కరుణ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందర్రావు, ఆర్ఎంపి తిరువీధుల ఆంజనేయులు, గురిపర్తి బోసు, కుందేటి రామకృష్ణ, చిట్టిబాబు, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేరాలకు ప్రజలు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలని, లేకుంటే శిక్షర్హులు అవుతారని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌరవ రమేష్ బాబు అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. బైక్ రేసులు, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు డ్రైవింగ్ చేయటం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం వంటి నేరాల నుంచి దూరంగా ఉండాలని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన చీరాల వన్ టౌన్ ఎస్ఐ ఎ హరిబాబు మాట్లాడుతూ నూతన చట్టాలకు అనుగుణంగా హెల్మెట్ లేని వాహనదారులకు భారీగా జరిమానాలు విధించ బోతున్నారని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కస్తూరినాథ్, బి రామారావు, సోషల్ వర్కర్ విఎస్‌డి మతీన్, ట్రాఫిక్ ఎఎస్ఐ సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బార్ ప్రసిడెంట్ జి రమేష్

బాపట్ల జిల్లాలో ప్రభుత్వ కాలేజీలు ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - బాపట్ల

మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఇచ్చిన జీఓను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల నుండి బాపట్ల జిల్లా కొత్తగా ఏర్పడిన ఈ ప్రాంతం వ్యవసాయ కార్మికులు, దళితులు, వెనుకబడిన తరగతుల కౌలు రైతులు ఎక్కువగా నివాసం ఉండే జిల్లాలో పేద విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగం అభివృద్ధి చెందుతున్న బాపట్ల జిల్లాలో ప్రధాన పట్టణాలైన బాపట్ల, చీరాలలో డిగ్రీ చదువుకు కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

కళాశాలలు లేకపోవడంతో ఈ ప్రాంతాల విద్యార్థులు అధిక వ్యయ ప్రయాసల కోర్చి ప్రైవేటు కళాశాలలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని అన్నారు. పీజీ కోర్సులు చదివేందుకు దూర ప్రాంతాలైన గుంటూరు, ఒంగోలు వెళుతున్నారని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పిజి సెంటర్ ఏర్పాటుకు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో మంత్రులు, జిల్లా శాసన సభ్యులు కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి చేసి, విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్స్ చార్జీలు, నోట్ పుస్తకాలు, ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ఇవ్వకుండా వాటికి నిధులు కేటాయించ కుండా గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఉందంటూ మాటలు చెప్పి సంక్షేమ హాస్టల్ విద్యార్థులను మోసం చేసిందని అన్నారు. గతేడాది విద్యార్థులకు ఇవ్వాల్సిన పది నెలల కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి నిధులు కేటాయించి, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేసి, హాస్టల్ విద్యార్థులకు చెల్లించాల్సిన కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివశంకర్, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు హేమ, నాగశ్రీ, ప్రేమ్ చందు, నితిన్, సందీప్, నవీన్, అహ్మద్ పాల్గొన్నారు.

భర్త పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య

ప్రజాశక్తి - బాపట్ల

కారంచేడు మండలం కుంకలమర్రుకు చెందిన బత్తుల వెంకట్రావుకు శోభారాణితో గత కొన్నేళ్ళ క్రితం వివాహం చేశారు. అక్కడ అప్పుల పాలైన భార్యా, భర్తలు బాపట్ల మండలం వెదుళ్ళపల్లికి వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కూడా అప్పులు బాధ తప్పలేదు. ఆటో డ్రైవర్‌గా ఉన్న వెంకటరావు అనేక చోట్ల అప్పులు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. అతని బాధ భరించలేక, అప్పులోళ్ళకు సమాధానం చెప్పలేక బాకీలు తీర్చే క్రమంలో భార్య శోభారాణి భర్త నడిపే ఆటోను తీసుకెళ్లి పోలీసులకు అప్పగించింది. ఆటో యజమాని వచ్చి ఆటోతో వెంకటరావుకు సంబంధం లేదని చెప్పి ఆటో తీసుకెళ్లారు. ఈ విషయమై తనకు న్యాయం చేయటంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిం చింది. ఆటోను తిరిగి ఇచ్చినందుకు పోలీసులను శోభా రాణి ప్రశ్నించింది. పోలీసు అధికారుల ఆదేశాల తోనే యజమానికి ఆటోను అప్పగించామని పోలీసులు స్పష్టం చేశారు. దీనిపై ఆందోళనకు గురైన ఆమె పోలీస్ స్టేషన్ ఎదుట పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో వెళ్లిన ఆమెను స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమిం చడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 4రోజులు మృత్యువుతో పోరాడి గురువారం మృతి చెందారు. భర్త పెట్టిన ఇబ్బందుల వల్లే శోభారాణి చనిపోయిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు వెదుళ్ళపల్లి సెంటర్లో రాస్తారోకో చేశారు. కారకుడైన భర్త వెంకట్రావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ హజరత్ బాబు తెలిపారు.

ఎస్ఎస్ ట్యాంక్ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును అభివృద్ధి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు శివప్రసాద్ తెలిపారు. పట్టణంలోని అరవపల్లి రోడ్డులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. తాగునీటి సరఫరాలో చిన్న చిన్న సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం ట్యాంకులో నీరు చివరి దశకి చేరుకున్నాయని అన్నారు. మరో 15రోజుల వరకు తాగునీరు అందించేందుకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం బంకింగ్ హం కెనాల్ ద్వారా కాలువలకు నీటిని విడుదల చేస్తున్న క్రమంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నీటితో నింపేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మరో రెండు రోజుల్లో పంట కాల్వలకు నీరు వస్తుందని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆరు 7.5 హెచ్‌పి మోటర్ల ద్వారా నీరు నింపేందుకు ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ఆలం, క్లోరిన్ గ్యాస్ నిల్వలను పరిశీలించారు. మంచినీటి చెరువు చుట్టూ పెరిగిపోయిన పిచ్చి మొక్కలను, ముళ్ళ చెట్లను తొలగించాలని అన్నారు. చెరువు చుట్టూ పరిశుభ్రమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య ఎదురు కాకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, డిఈ శివరామకృష్ణ, ఎఈలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - కారంచేడు

కౌలు రైతులకు 2011 భూ అధీకరణ చట్ట ప్రకారం భూ యజమాని అనుమతి లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు తహశీల్దారుకు గురువారం వినతి పత్రం అందజేశారు. మండలంలో 80శాతం భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నారని, కౌలు రైతుకు ప్రభుత్వ ఇచ్చే రాయితీ అందడం లేదని కౌలు రైతు సంఘం నాయకులు అన్నారు. పేదలు, వ్యవసాయ కార్మికులు కొంత భూమి కౌలుకు తీసుకొని కూలికి వెళ్లే బదులు ఆరు గాలం రేయి, పగలు కష్టపడి పనిచేస్తున్న కూలి సైతం గిట్టుబాటు కావడం లేదని అన్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టడం వల్ల అప్పులు, వడ్డీలు కట్టలేక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వారికి కౌలు రైతు కార్డు ఉంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ క్రింద కౌలు రైతుకు బ్యాంకు రుణం ఇస్తుందని రెవెన్యూ, వ్యవసాయ అధికారులు గ్రామ సభలు జరిపి



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కౌలురైతులు

కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దారుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు సంఘం నాయకులు పి ఏడుకొండలు, నాగేశ్వరరావు, రాజు, చేతి వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ పి కొండయ్య పాల్గొన్నారు.

ఉద్యమాలతో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనాలు

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ అధ్యక్షులు వైఎస్ రావు మాట్లాడుతూ 72ఏళ్ళ నుండి కార్మికుల ప్రయోజనాలు, సంస్థ అభివృద్ధికి సమైఖ్య ఉద్యమాలతో కార్మిక ప్రయోజనాలు కాపాడినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు అనుభవిస్తున్న 80శాతం ప్రయోజనాలు తమ యూనియన్ సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పే స్కేల్, 43శాతం ఫిట్మెంట్ ఇప్పించి ఆర్టీసీ ఉద్యోగులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా సీనియర్ ట్రాఫిక్ కంట్రోలర్ కామ్రేడ్ విఆర్ ప్రసాద్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ మహిళా కండక్టర్ జీఎన్ కుమారి, గ్యారేజ్ సీనియర్ విఎల్ నారాయణ, రాజేశ్వరరావు, యూనియన్ రాష్ట్ర నాయకులు బిటి వలి, జిల్లా కార్యదర్శి వైఎస్ రావు, డిపో నాయకులు నరసింహారావు, చలపతి పాల్గొన్నారు.



యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ నాయకులు

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - అద్దంకి

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక సింగరకొండలోని కెఆర్‌కె డిగ్రీ కళాశాల్లోని రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు విద్యార్థులతో మాట్లాడారు. డెంగ్యూ వంటి అంటూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండడమే నివారణకు మొదటి చర్యని అన్నారు. విద్యార్థులు డెంగ్యూ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై అవగాహన పెంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించాలని అన్నారు. ఎవరూ డెంగ్యూ బారిన పడకుండా ముందస్తూ చర్యలు తీసుకునేలా చూడవలసిన బాధ్యతగా భావించి ప్రజలకు వివరించాలని కోరారు. జువాలజీ అధ్యాపకులు హనుమంతరాజు మాట్లాడుతూ ప్రజల్లో డెంగ్యూ వంటి అంటు వ్యాధులపై అవగాహన ఉండాలని అన్నారు. డెంగ్యూ వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలు ఉధృతి చెంద కుండా మురుగు కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవడం లాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు శివకోటి మాట్లాడుతూ లింగ సమానత్వం ఉత్పాదకత, ప్రకృతి దాని ప్రభావం, జాతుల వలసలు, అతిక్రమణలు వంటి అంశాలకు జనాభా పెరుగుదలకు గల సంబంధాన్ని వివరించారు. కళాశాల నుండి నామ్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధిపై తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకులు రామకృష్ణ, ఎకనామిక్స్ అధ్యాపకులు గంగయ్య, బొటనీ అధ్యాపకులు రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.



ఆరుంబాక వద్ద ఇంట్లోకి దూసుకుపోయిన రొయ్యల లారీ

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

డ్రైవర్ నిద్ర మత్తులో జాతీయ రహదారి పక్కనున్న ఇంట్లోకి రొయ్యల లారీ దూసుకుపోయిన సంఘటన గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కృష్ణాజిల్లా కలిదిండి వైపు నుండి నెల్లూరు జిల్లాకు వెళ్తున్న లారీ చెరుకుపల్లి గ్రామ శివారు ఆరుంబాక వద్ద 216 ఏ జాతీయ రహదారి పక్కన ఉన్న రేకుల షెడ్యూల్లోకి దూసుకు వెళ్ళింది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండగా ప్రమాదం జరిగింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేక పోవడం తో ఎటువంటి ప్రమాదం జరగలేదు. పక్కనే విద్యుత్తు స్తంభం ఉండగా దాని ప్రక్కగా లారీ వెళ్లి ఆగింది. రేకుల షెడ్డుకు నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభానికి ఢీకొని ఉంటే భారీగా ప్రమాదం సంభవించి ఉండేది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ద

డిగ్రీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పొడిగింపు

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఎబిఆర్ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ మొదటి సంవత్సరం చేరబోయే విద్యార్థులకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ టి రవిచంద్ర కుమార్ తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం చేరబోయే విద్యార్థులు ఈ నెల 20వరకు ప్రభుత్వం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పొడిగిచారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



టి రవిచంద్రకుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ చిలుకూరి గోపి

విద్యార్థులను బడిలో చేర్చాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఎంఇఒ చిలుకూరి గోపి ఆధ్వర్యంలో యద్దనపూడి ఉన్నత పాఠశాల్లో వలేరు సామ్యూల్, మున్నంగి మహేష్‌లను 8వ తరగతిలో చేర్పించినట్లు హెచ్ఎం ఎం దేవేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ బడి బయట విద్యార్థులు లేకుండా చూడటమే కార్యక్రమ ముఖ్య ఉదేశ్యం అన్నారు. కార్యక్రమంలో సిఆర్పిలు ప్రేమ్ కుమార్, మస్తాన్ వలి, యూసఫ్ పాల్గొన్నారు.

తెలుగు సినీపాట ముద్దుబిడ్డ 'సినారె'

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక దత్త సాయి క్లినిక్ నందు జరిగిన సాహితీ సమావేశానికి చందలూరి నారాయణరావు అధ్యక్షత వహించారు. సి నారాయణరెడ్డి జీవిత, సాహిత్యం గురించి గాడేపల్లె దివాకర్ దత్తు మాట్లాడారు. అద్దంకిలో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సాహితీ విశ్లేషకులు ఆర్‌వి రాఘవరావును సంస్థ అధ్యక్షులు చందలూరి నారాయణరావు ఘనంగా సత్కరించారు. అన్నమనేని వెంకట్రావు, కోటయ్య, యు దేవపాలన, సత్యనారాయణ, శేషతల్పసాయి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి

యువ రైతు ఆత్మహత్య



మృతిచెందిన నాగరాజు

ప్రజాశక్తి-పర్చూరు

పురుగుల మందు తాగి నూతలపాడుకు చెందిన యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిలకలూరిపేట మండలం, బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన బాడుగల నాగరాజు(38) పది ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప పంట వేశాడు. కాలం కలిసిరాక మిరపకాయలకు రేటు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. సుమారు 12 లక్షల వరకు బాకీ పడినట్లు తెలిసింది. అప్పు తీర్చే మార్గం కనబడక గురువారం బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 'నేను నీకు న్యాయం చేయలేకపోతున్నాను..' అంటూ తన భార్యకు మెసేజ్ పెట్టినట్లు తెలిసింది. మృతదేహాన్ని చూసిన వారు పోలీసులకు, బంధువులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'వెలిగొండ'ను త్వరగా పూర్తిచేసి

నీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్



మాట్లాడుతున్న హనీఫ్

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

పశ్చిమ ప్రాంతం అభివద్ధి త్వరితగతిన జరగాలంటే వెలిగొండ ప్రాజెక్టు ఏకైక మార్గమని, ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో పార్టీ సమావేశం రమణారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ హనుమంతునిపాడు మండలం నిరంతరం కరువు, వలసలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. అభివృద్ధికి ఆమడదూరంలో సమస్యల వలయంలో నిరంతరం ఉందన్నారు. తాగునీరు లేదని, సాగునీరు లేదని ఉపాధి లేదని.. గ్రామాలకు గ్రామాలను ప్రజలు ఖాళీలు చేసి.. వలసలు పోతున్నారని పేర్కొన్నారు. వలసలు నివారించాలంటే వెలుగొండ ప్రాజెక్టు ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. మండల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 23 పంచాయతీలలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. సాగర్ జలాల పంపిణీ సక్రమంగా జరగట్లేదని తెలిపారు. పైపులైన్లు నిరంతరం లీకేజ్ వల్ల పేదల గొంతులు తడవటం లేదన్నారు. ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికీ సాగర్ జలాలు అందే విధంగా శాసనసభ్యులు, నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు కత్తి ఏబు, ఏలియా, సభ్యులు వెలుగొండయ్య, వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌కు ఏపిడబ్ల్యుజెఎఫ్ వినతి



జర్నలిస్టు నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు కోరారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఏపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వి.బ్రహ్మం మాట్లాడుతూ జిల్లాలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై దాడులు పెరిగాయని, వాటి నివారణకు అటాక్స్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా గతంలో జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించి ప్రభుత్వం ద్వారా ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు విద్యా హక్కు చట్టంలో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. గత టిడిపి హయాంలో పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం రాయితీ ఇస్తూ జీవో జారీ అయిందన్నారు. విద్యా శాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సంయుక్త సమావేశం నిర్వహించి ఫీజు రాయితీ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హామీ ఇచ్చారు. జర్నలిస్టులపై దాడులకు సంబంధించి అటాక్స్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే విషయమై ప్రభుత్వంతో మాట్లాడి తరువాత ఏర్పాటు చేస్తామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ విషయమై ఏయే జిల్లాల్లో కలెక్టర్లు ఇచ్చారో ఆర్డర్ కాపీలు ఇస్తే విద్యా శాఖాధికారులతో మాట్లాడి ఫీజు రాయితీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి భక్తవత్సలం, జిల్లా గౌరవాధ్యక్షులు కారుసాల అశోక్‌బాబు, కోశాధికారి ఎల్.రాజు, పి9 న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్, టీవీ9 స్టాఫ్ రిపోర్టర్ ఫైరోజ్ బేగ్, టీవీ5 స్టాఫ్ రిపోర్టర్ ఎన్ జనార్ధన్, సీనియర్ జర్నలిస్టులు ఆర్‌వి రాజశేఖర్, ఆంధ్రప్రభ బ్యూరో భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులను

అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు



బాపట్లలో నిత్యావసరాల విక్రయాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మధ్యతరగతి ప్రజల సంక్షేమం దష్ట్యా నిత్యావసర సరుకుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందని కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌ను కలెక్టర్ జె.వెంకటమురళి, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ కలిసి గురువారం ప్రారంభించారు. బాపట్ల రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని రైతు బజార్‌ను కలెక్టర్ వెంకటమురళి, శాసన సభ్యులు నరేంద్రవర్మ కలిసి పరిశీలించారు. మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కల్పించేలా తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు అందిస్తున్నామని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కౌంటర్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, బాపట్ల ఆర్డీవో జి.రవీందర్, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్య క్షులు బి రత్నగుప్తా, కార్యదర్శి శ్రీనివాసరావు, తాలూకా అధ్యక్షులు శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్: రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం కందిపప్పు విక్రయించే కౌంటర్లను ఒంగోలు నగరంలోని మూడు రైతు బజార్‌లలో, డీమార్ట్‌లో గురువారం ఒంగోలు ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక లాయరుపేట సాయిబాబా గుడి పక్కన ఉన్న రైతు బజార్‌లో విక్రయ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జెసి ఆర్.గోపాలకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభకు జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ.ఉదయభాస్కర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సహాయ సరఫరా అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఉపేంద్ర జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సత్యనారాయణ, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టిడిపి 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, తెలుగు నాడు డ్వాక్రా అంగన్‌వాడీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి, రైతు బజార్లో ఎస్టేట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఒంగోలులో కౌంటర్ ప్రారంభిస్తున్న దామచర్ల

ఇన్‌పుట్స్ పూర్తిస్థాయిలో సిద్ధం చేయండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సాగుకు అవసరమైన ఇన్‌పుట్స్‌ను ముందుగానే పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా స్పష్టం చేశారు. గురువారం ఆమె వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సాగు వివరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు పద్ధతులు, ప్రభుత్వం నుంచి అందిస్తున్న ఇన్‌పుట్స్ సరఫరా, దిగుబడి లక్ష్యాలు, వాటి అంతిమ ఫలితం, సాగులో అందుబాటులోకి వస్తున్న కొత్త సాంకేతికత రైతులకు వాటిని చేరవేస్తున్న విధానం, ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతున్న తీరు వంటి అంశాలపై ఆమె ఆరా తీశారు. ఆయా విషయాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి, ఏపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ పివి రమణ, జిల్లా ఉద్యాన అధికారి వై.గోపీచంద్. ఆత్మ పీడీ అన్నపూర్ణ, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రతి కౌలు రైతుకూ కార్డు ఇవ్వాలి..: తహశీల్దార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలో ప్రతి కౌలు రైతునూ గుర్తించి వారికి కౌలు కార్డులను ఇవ్వాలని తహశీల్దార్ ఎస్‌కె.మీరావలి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ అభివద్ధి కార్యాలయంలో గురువారం ఆయన మండల వ్యవసాయ అధికారి సమక్షంలో గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌలు కార్డులు జారీచేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ షేక్ మీరావలి, మండల వ్యవసాయ అధికారి పి.పావని మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి వారికి గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి కౌలు కార్డు ఇప్పించాలని తెలియజేశారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి

ఐక్యవేదిక నాయకుల వినతి



ఎమ్మెల్యేను కలిసిన ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి టౌన్ మరియు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ రంగారావుకు వామపక్ష మరియు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి భూగర్భ జలాల పెంపుకు తోడ్పడే విధంగా కనిగిరి పెద్ద చెరువు నాగుల చెరువులను సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులుగా మార్చాలన్నారు. కనిగిరి పెద్ద చెరువు నాగుల చెరువులను కాపాడుకునేందుకు పూర్తిస్థాయిలో ఆక్రమణ దారులు రియల్ ఎస్టేట్ యజమానులపై కఠిన చర్యలు తీసుకొని ఆక్రమణదారుల నుండి సదరు భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. కనిగిరి ఏరియా ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్య మరియు ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కనిగిరి రెవిన్యూ డివిజన్ కేంద్రం కనుక ప్రజల అవసరాల కోసం రాకపోకలు పెరిగాయన్నారు. అసైన్డ్ భూములలో వేసిన వెంచర్లను నిషేధించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని రియల్‌ఎస్టేట్ వెంచర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి సాగునీటి చెరువుల్లో చేపల పెంపకాన్ని నిషేధించాలని, నీటి కాలుష్యాన్ని నివారించాలని కోరారు. రాగిమానిపల్లె-తాళ్లూరు మధ్య తారు రోడ్డు నిర్మాణం చేయాలని 77 ఏళ్లుగా వీరికి కనీసం రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు పీవీ శేషయ్య, పి రమణారెడ్డి, డి మల్లికార్జునరావు ఉన్నారు.

13న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



వైద్యశిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి టారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఈ నెల 13న స్థానిక బూచేపల్లి కల్యాణ మండపంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక బూచేపల్లి కమలాకరరెడ్డి పార్కులో ఏర్పాటుచేసిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రముఖ సినీనటులు దివంగత బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతి సందర్భంగా మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తారన్నారు. తమ ట్రస్టు ద్వారా పెదకాకానికి రాకపోకలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, పట్టణ వైసిపి అధ్యక్షులు కె శేఖరరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు, కౌన్సిలర్లు భీమన వెంకటరావు, సోమా శేషాద్రి, ఎస్‌కె సుందరరామిరెడ్డి, యల్లయ్య, జి చంద్ర, బాషా, వెంకటేశ్వర్లు, పాలడుగు సుబ్బారావు, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అయ్యపురెడ్డి రామబ్రహ్మం పాల్గొన్నారు.